ఓటమితో వీడ్కోలు

మలాగా(స్పెయిన్): టెన్నిస్‌లో ఒక శకం ముగిసింది. తన అద్భుత ఆటతీరుతో ఇన్నేండ్లు ప్రపంచ అభిమానులను అలరించిన స్పెయిన్ స్టార్ రఫెల్ నాదల్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించిన నాదల్ స్పెయిన్ తరపున ఆఖరి ఆట ఆడేశాడు. డేవిస్‌కప్‌లో భాగంగా నెదర్లాండ్స్‌తో జరిగిన పోరులో నాదల్ 4-6, 4-6తో బోటిక్ వాన్‌డీ చేతిలో ఓటమిపాలయ్యాడు. మ్యాచ్ తర్వాత నాదల్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు.

టైటాన్స్ జోరు

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ జోరు కొనసాగుతోంది. గత మ్యాచ్‌లో హర్యానాను కంగుతినిపించిన టైటాన్స్.. బుధవారం మాజీ చాంపియన్ యూ ముంబాను ఓడించింది. నోయిడాలో జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 31-29తో యూ ముంబాపై ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. పీకేఎల్-11లో ఆడిన 11 మ్యాచ్‌లలో టైటాన్స్‌కు ఇది ఏడో విజయం. టైటాన్స్ తరపున అశిష్ (8), సాగర్ (4), అజిత్ (4) రాణించారు.

సింధు, లక్ష్యసేన్ శుభారంభం

షెన్‌జెన్ (చైనా): భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్, మాళవిక బన్సోద్ చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్‌లో సింధు 21-17, 21-19తో బుసానన్ (థాయ్‌లాండ్)ను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. బుసానన్‌తో జరిగిన 21 మ్యాచ్‌లలో సింధుకు ఇది 20వ విజయం కావడం విశేషం. మరో పోరులో 36వ ర్యాంకర్ మాళవిక 20-22, 23-21, 21-16తో తనకంటే మెరుగైన ర్యాంక్ (21) కలిగిన డెన్మార్క్ షట్లర్ హోజ్మర్క్‌కు షాకిచ్చింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్.. 21-14, 13-21, 21-13తో జియాను ఓడించాడు.

తిలక్ వర్మ @3

- 69 స్థానాలు ఎగబాకిన హైదరాబాదీ
- ఆల్‌రౌండర్లలో హార్దిక్‌కు అగ్రస్థానం

దుబాయ్: ఇటీవలే దక్షిణాఫ్రికా పర్యటనలో బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో అదరగొట్టిన టీమ్‌ఇండియా యువ సంచలనం తిలక్ వర్మ (806) ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపాడు. తన కెరీర్‌లో తొలిసారి టాప్-10లోకి వచ్చిన ఈ హైదరాబాదీ కుర్రాడు.. ఏకంగా 69 ర్యాంక్‌లు ఎగబాకి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ క్రమంలో అతడు టీ20 ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్‌వన్ బ్యాటర్ అయిన 'నయా 360' సూర్యకుమార్ యాదవ్(788)ను వెనక్కినెట్టి మూడో ర్యాంక్‌లో నిలవడం గమనార్హం. ఈ జాబితాలో ట్రావిస్ హెడ్ (855), ఫిల్ సాల్ట్(828) మాత్రమే తిలక్ కంటే ముందున్నారు. సఫారీ సిరీస్‌లో రెండు శతకాలు బాదిన సంజూ శాంసన్ 17 ర్యాంక్‌లు మెరుగుపరుచుకుని 22వ స్థానంలో ఉన్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా (244) రెండు ర్యాంక్‌లు ఎగబాకి తిరిగి అగ్రస్థానానికి చేరాడు. బౌలర్ల విషయానికొస్తే భారత్ నుంచి రవి బిష్ణోయ్ (8), అర్ష్‌దీప్ సింగ్ (9) టాప్-10లో చోటు దక్కించుకున్నారు.

కేరళకు మెస్సీ

మలబారు తీరాన రెండు మ్యాచ్‌లు ఆడనున్న అర్జెంటీనా

తిరువనంతపురం: భారత్‌లో క్రికెట్‌తో పోల్చితే ఫుట్‌బాల్‌కు ఆశించిన స్థాయిలో క్రేజ్ లేకపోయినా అంతర్జాతీయ స్థాయిలో ఆడే స్టార్లకు మాత్రం ఇక్కడ ఆదరణ ఎక్కువే. ఆ జాబితాలో అగ్రస్థానాన ఉండే ఫుట్‌బాల్ ప్లేయర్లలో అర్జెంటీనా సారథి లియోనల్ మెస్సీ ముందువరుసలో ఉంటాడు. మరీ ముఖ్యంగా ఫుట్‌బాల్ అంటే తెగ ఇష్టపడే కేరళలో మెస్సీ ఆరాధ్య దైవం. ఇక్కడి అభిమానులను తన విన్యాసాలతో అలరించడానికి గాను స్వయంగా మెస్సీ తన జట్టుతో పాటు వచ్చే ఏడాది కేరళకు రానున్నాడు. మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా 2025లో కేరళ వేదికగా రెండు అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లు ఆడనున్నట్టు ఆ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి అబ్దుర హిమాన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 'అవును.. వరల్డ్ నంబర్‌వన్ ఫుట్‌బాల్ టీమ్ అయిన అర్జెంటీనా వచ్చే ఏడాది కేరళకు రానుంది. ఆ జట్టుతో మెస్సీ కూడా వస్తాడు' అని అన్నారు. కేరళ ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహించబోయే ఈ మ్యాచ్‌లకు రాష్ట్ర వ్యాపారస్తులు ఆర్థిక సాయాన్ని అందించనున్నారు. మ్యాచ్‌ల వేదిక, ప్రత్యర్థికి సంబంధించిన విషయాలను త్వరలో వెల్లడించనున్నట్టు అబ్దురహిమాన్ చెప్పారు.

ఆసియా హమారా

టైటిల్ నిలబెట్టుకున్న భారత అమ్మాయిలు ● ఫైనల్లో చైనాపై అద్భుత విజయం ● ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ

రాజ్‌గిర్ (బీహార్): మహిళల హాకీ ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. బుధవారం రాజ్‌గిర్ వేదికగా జరిగిన ఫైనల్‌లో భారత్ 1-0తో చైనాను ఓడించి వరుసగా రెండోసారి ఏషియన్ చాంపియన్స్ ట్రోఫీ (ఏసీటీ)ని సొంతం చేసుకుంది. చైనాతో ఆద్యంతం హోరాహోరీగా సాగిన పోరులో భారత్ తరపున ఈ టోర్నీలో అత్యధిక గోల్స్(11) చేసిన యువ స్ట్రైకర్ దీపికా 31వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి విజయంలో కీలకపాత్ర పోషించింది. ఈ టోర్నీలో ఓటమన్నదే లేకుండా అజేయంగా నిలిచిన భారత్‌కు ఏసీటీని దక్కించుకోవడం 2016, 2023 తర్వాత ఇది మూడోసారి కాగా రన్నరప్‌గా నిలవడం చైనాకూ ఇది మూడో సారే కావడం గమనార్హం. గతంలో దక్షిణకొరియా మాత్రమే మూడు ట్రోఫీలు సాధించింది. ఇక మూడో స్థానం కోసం జరిగిన పోరులో జపాన్ 4-1తో మలేషియాను ఓడించింది.

హోరాహోరీ పోరు

లీగ్ దశలో చైనాను 3-0తో ఓడించినా ఫైనల్లో మాత్రం డ్రాగన్ అంత తేలిగ్గా లొంగలేదు. ఆట అర్ధభాగం ముగిసేసరికి ఇరు జట్లు గోల్ లేకుండా నిలిచాయి. రెండు జట్లూ డిఫెన్స్, అటాకింగ్‌లో ఒకరిని మించి ఒకరన్నట్టుగా పోరాడాయి. ఈ టోర్నీలో పెనాల్టీ కార్నర్ (పీసీ)లను సద్వినియోగం చేసుకోలేక తంటాలుపడ్డ భారత్.. ఫైనల్‌లోనూ అదే సమస్యలు ఎదుర్కొంది. రెండో క్వార్టర్ ఆరంభంలో చైనాకు తొలి పీసీ అవకాశం వచ్చినా యువ గోల్ కీపర్ బిచు దేవి అద్భుతంగా అడ్డుకుంది. ఆ తర్వాత రెండు నిమిషాల వ్యవధిలోనే భారత్‌కు మూడు పెనాల్టీ కార్నర్ చాన్స్‌లు వచ్చాయి. కానీ మన అమ్మాయిలు వాటిలో ఒక్కదానినైనా గోల్‌గా మలచలేకపోయారు. ఇక మూడో క్వార్టర్ ఆరంభమైన కాసేపట్లోనే దీపిక రాకెట్ వేగంతో కొట్టిన గోల్‌తో భారత్ ఊపిరి పీల్చుకుంది. 42వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్ అవకాశం రాగా దీపిక కొట్టిన బంతిని చైనా గోల్‌కీపర్ సమర్థవంతంగా అడ్డుకుంది. తర్వాత ఇరు జట్లూ గోల్ కోసం ప్రయత్నించినా విజయవంతం కాలేకపోయాయి.

నేడే టీవోఏ ఎన్నికలు

అధ్యక్ష బరిలో చాముండేశ్వర్‌నాథ్, జితేందర్‌రెడ్డి .. ఎన్నికల ఫలితాలపై సిటీ సివిల్ కోర్టు స్టే

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్(టీవోఏ) ఎన్నికలకు రంగం సిద్ధమైంది. గురువారం ఎల్బీ స్టేడియం ఒలింపిక్ భవన్ వేదికగా టీవోఏ కార్యవర్గ ఎన్నికలు జరుగనున్నాయి. అధ్యక్ష పదవి కోసం రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చాముండేశ్వర్ నాథ్ పోటీపడుతున్నారు. ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవుల కోసం ఎన్నిక జరుగనుండగా, మిగతా స్థానాలకు సభ్యుల ఎన్నిక లాంఛనం కానుంది. ప్రధాన కార్యదర్శి పదవి కోసం బాబురావు, మల్లారెడ్డి మధ్య పోటీ ఉండగా, కోశాధికారి కోసం సతీశ్‌గౌడ్, ప్రదీప్‌కుమార్ రేసులో ఉన్నారు. ఇదిలా ఉంటే టీవోఏ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలన్న ఉద్దేశంతో ఉన్న జితేందర్‌రెడ్డి, చాముండేశ్వర్‌నాథ్ వర్గాలు తమ ప్రయత్నాలు తీవ్రం చేశాయి. ఆయా అసోసియేషన్లకు చెందిన సభ్యులను తమ వైపునకు తిప్పుకునేందుకు నగరంలోని ఒక హోటల్‌లో ప్రత్యేకంగా క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీనికి తోడు సభ్యులను డబ్బులతో ఎరవేస్తూ వారి డిమాండ్లను నెరవేర్చేందుకు వెనుకాడటం లేదని వినికిడి. మరో వర్గం అందరినీ ప్రత్యక్షంగా కలుస్తూ భారీగా హామీలు గుప్పిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. బుధవారం రాత్రి వరకు టీవోఏ ఎన్నికలపై సందిగ్ధత నెలకొన్నది. ఓటింగ్‌లో తమకు పాల్గొనే అవకాశం లేకుండా చేశారన్న ఉద్దేశంతో బాక్సింగ్ సంఘం సిటీ సివిల్‌కోర్టును ఆశ్రయించింది. పిటీషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం ఎన్నికలు కొనసాగించవచ్చని, అయితే ఫలితాలపై స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఇరు పక్షాలకు చెందిన సభ్యులు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలకు దిగారు. ప్రభుత్వంలో భాగమై ఉండటంతో పాటు జాతీయ స్పోర్ట్స్ కోడ్(2011)కు విరుద్ధంగా 70 ఏండ్ల వయసులో జితేందర్‌రెడ్డి ఎలా పోటీచేస్తారంటూ చాముండేశ్వర్‌నాథ్ వర్గం విమర్శలకు దిగింది.

అఫ్జల్‌కు సాట్స్ ఆర్థిక సాయం

రూ.3లక్షల చెక్ అందజేత

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత వెటరన్ ఫుట్‌బాల్ ప్లేయర్ డీఎంకే అఫ్జల్‌కు సాట్స్ అండగా నిలిచింది.ఆర్థిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అఫ్జల్‌కు సాట్స్ తరపున రూ.3లక్షల ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం గొల్కొండ రిసాల బజార్‌లోని అఫ్జల్ ఇంటికి స్వయంగా వెళ్లిన సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీబాలదేవి ఆయన కుటుంబ సభ్యులకు చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భారత మాజీ ఫుట్‌బాల్ ప్లేయర్లు షబ్బీర్ అలీ, విక్టర్ అమల్‌రాజ్ పాల్గొన్నారు. 1962 జకార్తా ఆసియా గేమ్స్‌లో స్వర్ణం సాధించిన భారత జట్టులో అఫ్జల్ సభ్యుడు.

హమ్మయ్య! పుజారా లేడు

ఆసీస్‌కు మేలు: హాజిల్‌వుడ్

పెర్త్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)లో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనకు వచ్చిన భారత జట్టులో 'నయా వాల్' ఛటేశ్వర్ పుజారా లేకపోవడం ఆతిథ్య జట్టుకు ఎంతో కలిసొస్తుందని ఆసీస్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ అభిప్రాయపడ్డాడు. గత రెండు పర్యటనలలో భారత్..బీజీటీని సొంతం చేసుకోవడంలో పుజారాది కీలకపాత్ర. హాజిల్‌వుడ్ మాట్లాడుతూ 'ఈసారి భారత జట్టులో పుజారా లేకపోయినందుకు నాకు సంతోషంగా ఉంది. గత రెండు పర్యటనలలో అతడు కీలకపాత్ర పోషించాడు. అతడి వికెట్ తీసేందుకు ప్రతి సారి ప్రయత్నించేవాడిని' అని అన్నాడు. పుజారా లేకపోయినా ప్రస్తుతం భారత జట్టులో అద్భుతంగా ఆడగల నైపుణ్యమున్న ఆటగాళ్లు చాలామంది ఉన్నారని అన్నాడు.

ఖలీల్ స్థానంలో దయాల్

లెఫ్టార్మ్ సీమర్ యశ్ దయాల్ ఆస్ట్రేలియాలో ఖలీల్ స్థానాన్ని భర్తీ చేయనున్నాడు. బంగ్లాతో సిరీస్‌లో ఎంపికైనప్పటికీ దయాల్‌కు మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు.



మైసూర్‌లో యాక్షన్ షురూ?

రామ్‌చరణ్ కథానాయకుడిగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్నది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అప్‌డేట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ వారంలోనే మైసూర్‌లో షూటింగ్‌ను మొదలుపెట్టబోతున్నారని తెలిసింది. రామ్‌చరణ్‌తో పాటు ప్రధాన తారాగణంపై అక్కడ కొన్ని కీలక ఘట్టాలను తెరకెక్కిస్తారని సమాచారం. ఉత్తరాంధ్ర నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ సినిమాలో రామ్‌చరణ్ పాత్ర సరికొత్త పంథాలో ఉంటుందని చెబుతున్నారు. ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తున్నారు. భారీ వ్యయంతో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఇదిలావుండగా రామ్‌చరణ్ తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్' జనవరి 10న ప్రేక్షకుల ముందుకురానుంది.

చిత్రం

విమర్శలను పట్టించుకోను

'సినిమాల ఎంపికలో నేను చాలా సెలెక్టివ్‌గా ఉంటాను. రొటీన్‌కు భిన్నంగా వైవిధ్యమైన కథలకే ప్రాధాన్యతనిస్తాను. 'జెర్సీ' తర్వాత అవకాశాలు వెల్లువెత్తాయి. ఆ తర్వాత కొన్ని ఫ్లాపులొచ్చాయి. అయినా ఎప్పుడూ బాధపడలేదు. ఈ ప్రయాణంలో నటిగా మరింత పరిణితి సాధించానని భావిస్తున్నా' అని చెప్పింది శ్రద్ధాశ్రీనాథ్. ఆమె విశ్వక్‌సేన్ సరసన కథానాయికగా నటించిన 'మెకానిక్ రాకీ' చిత్రం ఈ నెల 22న ప్రేక్షకుల ముందుకురానుంది. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను మాయ అనే అమ్మాయిగా కనిపిస్తా. ఇప్పటివరకు చేయని డిఫరెంట్ క్యారెక్టర్. మెకానిక్ రాకీ జీవితంలో మాయ ఎలాంటి మార్పులకు కారణమైందనే అంశం ఆసక్తికరంగా ఉంటుంది. ఈ కథలో ఊహించని మలుపులు, సర్‌ప్రైజ్‌లు ఉంటాయి' అని చెప్పింది. గతంలో ఓ సారి విశ్వక్‌సేన్ సినిమాను ఎందుకు రిజెక్ట్ చేశారనే ప్రశ్నకు స్పందిస్తూ 'అది రీమేక్ మూవీ. నాకు రీమేక్ సినిమాలు చేయడం ఇష్టం ఉండదు. అందుకే నో చెప్పాను. ఈ సినిమాలో విశ్వక్‌తో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. అతను చాలా ఎనర్జిటిక్. ఎప్పుడూ సరదాగా ఉంటాడు' అని తెలిపింది. ఇండస్ట్రీలో తనకు గాడ్‌ఫాదర్స్ ఎవరూ లేరని, హిట్, ఫ్లాప్స్‌ను సమదృష్టితో చూడటం అలవాటు చేసుకున్నానని, విమర్శలను కూడా అంత సీరియస్‌గా తీసుకోనని శ్రద్ధా శ్రీనాథ్ పేర్కొంది. బాహుబలి, కల్కి వంటి పీరియాడిక్ కథల్లో నటించాలన్నది తన డ్రీమ్ అని, ప్రస్తుతం తెలుగులో 'డాకు మహారాజ్' చిత్రంలో నటిస్తున్నానని చెప్పింది.

సంక్రాంతికి నాన్‌స్టాప్ నవ్వులే!

అగ్ర హీరో వెంకటేష్ నటిస్తున్న తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న విడుదల కానుంది. బుధవారం నిర్వహించిన రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ 'టైటిల్‌లో చెప్పినట్లుగా నిజంగానే సంక్రాంతికి వస్తున్నాం (నవ్వుతూ). యూత్, ఫ్యామిలీస్ అందరికి ఈ సినిమా నచ్చుతుంది. నా కెరీర్‌లో బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సంక్రాంతికి చక్కటి వినోదాన్ని పంచుతుంది' అన్నారు. ఈ సినిమా రషెష్ చూసి నాన్‌స్టాప్‌గా నవ్వుకున్నామని, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమా నుంచి తమ సంస్థతో వెంకటేష్‌గారి అనుబంధం కొనసాగుతున్నదని, ఆ సినిమా తరహాలోనే పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని దిల్‌రాజు పేర్కొన్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'క్రైమ్ నేపథ్యంలో నడిచే ఫన్ ఎంటర్‌టైనర్ ఇది. ప్రేక్షకులు థ్రిల్‌కు గురవుతారు. వెంకటేష్‌గారితో హ్యాట్రిక్ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. కథానాయికలు ఐశ్వర్యరాజేష్, మీనాక్షి చౌదరి పాత్రలు గుర్తుండిపోతాయి' అని చెప్పారు. పోలీస్ పాత్ర చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నానని, ఈ సినిమాతో ఆ కల తీరిందని మీనాక్షి చౌదరి పేర్కొంది. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

డివైన్ కంటెంట్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

మహేష్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. అర్జున్ జంధ్యాల దర్శకుడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. 'హను-మాన్' ఫేమ్ ప్రశాంత్‌వర్మ కథనందించారు. ఈ నెల 22న విడుదల కానుంది. మంగళవారం నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకకు దర్శకుడు బోయపాటి శ్రీను, హీరో సుధీర్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన బోయపాటి శ్రీను.. సినిమా అద్భుతంగా వచ్చిందని, విజువల్స్, మ్యూజిక్ అదిరిపోయాయని చిత్ర బృందాన్ని ప్రశంసించారు. ప్రశాంత్‌వర్మ కథనందించాడంటే తప్పకుండా ఏదో ఒక ఇంట్రస్టింగ్ ఎలిమెంట్ ఉంటుందని, ఈ సినిమా విజయంపై కాన్ఫిడెంట్‌గా ఉన్నామని ఎంపీ గల్లా జయదేవ్ పేర్కొన్నారు. ప్రశాంత్‌వర్మ మాట్లాడుతూ 'నేను రాసిన కథల్లో ఇది మాస్ ఎంటర్‌టైనర్. తన పాత్ర కోసం అశోక్ సరికొత్త మేకోవర్‌తో సిద్ధమయ్యారు. అనేక సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ప్రేక్షకులను థ్రిల్‌కి గురిచేస్తుంది' అన్నారు. డివైన్ కంటెంట్‌తో తీసిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుందని దర్శకుడు అర్జున్ జంధ్యాల తెలిపారు. హృదయాన్ని కదిలించే ఎమోషన్స్‌తో అందరిని మెప్పించే చిత్రమని హీరో అశోక్ గల్లా పేర్కొన్నారు.

ఉత్కంఠగా సాగే థ్రిల్లర్

అమ్మ రాగిన్ రాజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'తల'. అమ్మ రాజశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మెగాసూపర్ గుడ్ ఫిలింస్ పతాకంపై ఎన్ వీప్రసాద్, వాకాడ అంజన్ కుమార్ నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల కానుంది. బుధవారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ 'ఈ చిత్రం ద్వారా మా అబ్బాయిని హీరోగా పరిచయం చేస్తున్నా. యాక్షన్, థ్రిల్లింగ్, కామెడీ ఎలిమెంట్స్‌తో సాగే వినూత్నమైన కథ ఇది. యువతతో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ మెచ్చే అన్ని అంశాలుంటాయి' అన్నారు. ప్రేక్షకులను ఆద్యంతం థ్రిల్‌కు గురిచేయడంతో పాటు చక్కటి వినోదాన్ని పంచే చిత్రమిదని హీరో అమ్మ రాగిన్ రాజ్ పేర్కొన్నారు. ఎస్తేర్, అవినాష్, సత్యం రాజేష్, అజయ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె నాయుడు, సంగీతం: తమన్, ఎస్.అస్లాం కేయి, ధర్మతేజ, కథ, కొరియోగ్రఫీ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అమ్మ రాజశేఖర్.

గోవాలో ఎమ్4ఎమ్ ట్రైలర్

జోశర్మ, సంబీత్ ఆచార్య ప్రధాన పాత్రల్లో నటించిన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్ 'ఎమ్4ఎమ్' (మూటీవ్ ఫర్ మర్డర్). స్వీయ దర్శక నిర్మాణంలో మోహన్ వడ్లపట్ల తెరకెక్కించారు. త్వరలో ఐదు భాషల్లో వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ చిత్ర హిందీ ట్రైలర్‌ను గోవా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ఈ నెల 23న ఆవిష్కరించనున్నారు ఈ సందర్భంగా దర్శకనిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ 'యూనివర్సల్ కాన్సెప్ట్ ఇది. హత్య వెనక కారణాలేమిటనే అంశం ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురిచేస్తుంది. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌లో మునుపెన్నడూ చూడని సైకో పాత్రను చూడబోతున్నారు. సాంకేతికంగా కూడా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కించాం' అన్నారు. శుభలేఖ సుధాకర్, సత్యకృష్ణ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: సంతోష్ షానమోని, సంగీతం: వసంత్ ఇసాయిపెట్టై, సంభాషణలు: శ్రీచక్ర మల్లికార్జున, నిర్మాణం, దర్శకత్వం: మోహన్ వడ్లపట్ల.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.